
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
సోమవారం 18 ఆగస్టు 2025





గ్రామాల్లో ఘనంగా శ్రావణ బోనాలు 8

తండాల్లో తీజ్ తళుక్కులు



జిల్లెలగడ్డ తండాలో తీజ్ బుట్టలతో గిరిజన యువతులు

లంబాడీల ప్రత్యేక పండుగ.. సంస్కృతి, సంప్రదాయాల వేడుక

తొమ్మిది రోజుల పాటు సాగే ఆటపాటలు

వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని యువతుల మొక్కులు

21న హుస్నాబాద్‌లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

హుస్నాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : లంబాడీ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన తీజ్ పండుగ తండాల్లో మొదలైంది. హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో ఈ వేడుకలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా పెళ్లికాని యువతులు మంచి భర్త దొరకాలని, పంటలు బాగా పండి సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటూ ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.

తొమ్మిది రోజుల పండుగ

తీజ్ పండుగ మొత్తం తొమ్మిది రోజుల పాటు సాగుతుంది. మొదటి రోజు సాయంత్రం యువతులు నాయకుని ఇంటికి చేరుకుని గోధుమలను నానబెడతారు. మరుసటి రోజు మిగతా 8లో



తీజ్‌మంచ తండాలో నృత్యాలు (ఫైల్)

పెద్దచెప్యాలలో ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం



కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డి మండలం పెద్దచెప్యాల గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం నెలకొంది. గ్రామానికి చెందిన కమటం నరేశ్ సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరత ఉందని, రైతులకు యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. వ్యవసాయ ఆధారిత నియోజకవర్గాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం తెలిపారు. ప్రజాసేవ కార్యక్రమానికి వచ్చి ముఖ్యమంత్రిని విమర్శించడం సరికాదని ప్రశ్నించారు. దీనితో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చెలరేగింది. 'పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి ఏ అభివృద్ధి చేశారో చెప్పాలి' అంటూ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా పోలీసులు జోక్యం చేసుకున్నారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని అక్కడి నుంచి పంపించి, ఇరువర్గాల నాయకులను శాంతపరిచారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఇతర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు బియ్యం పంపిణీ చేసి వారి ఆకలి తీరుస్తున్న రేషన్ డీలర్లు మాత్రం డీలా పడిపోయారు. ఐదు నెలలుగా ప్రభుత్వం నుంచి కమీషన్ అందలేదు. దాదాపు రూ.2.87 కోట్లు బకాయిపడింది. దీంతో జిల్లాలోని 686 మంది డీలర్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.



రేషన్ డీలర్ల డీలా

సకాలంలో అందని కమీషన్

జిల్లాలో 686 మందికి రూ.2.87 కోట్లు పెండింగ్

కేంద్రం నుంచి ఐదు నెలలు, రాష్ట్రం మూడు నెలల బకాయిలు

సిద్దిపేట ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి కమీషన్‌ను ముందుగా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించేది. తర్వాత కేంద్ర ప్రభుత్వానికి బిల్లులు పెట్టుకునేది. ఐదు నెలల క్రితం ఈ విధానంలో మార్పులు చోటుచేసుకువడంతో రాష్ట్ర ప్రభుత్వం కమీషన్‌ను వేరుగా చెల్లిస్తున్నది. ఏ విధానమైనా డీలర్లుకు మాత్రం సమస్యలు తప్పడం లేదు. రెండు ప్రభుత్వాల నుంచి సకాలంలో కమీషన్ అందక సతమతం అవుతున్నారు.

3,26,630 రేషన్‌కార్డుదాలు

జిల్లాలో 2,91,374 రేషన్ కార్డులుండగా, మే, జూన్ నెలలో మంజూరు మిగతా 8లో

వెంటనే బకాయిలను చెల్లించాలి



రాష్ట్రంలోని రేషన్ డీలర్లకు కమీషన్ రాకపోడంతో ఐదు నెలల నుంచి ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. మేము పూర్తిగా కమీషన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి వేతనాలు కానీ, ఈఎస్ఐ, పీఎఫ్ లాంటి సౌకర్యాలు లేవు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు రావాల్సిన బకాయి డబ్బును వెంటనే చెల్లించాలని కోరుతున్నాం.

- వంగరి నాగరాజు, వైస్ ప్రెసిడెంట్, రాష్ట్ర రేషన్ షాప్ డీలర్ల సంఘం

ఆరోగ్యమే నిజమైన అభివృద్ధి

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయికి ఎంపికైన ఎనిమిది మంది యోగా సాధకులను ఆదివారం సిద్దిపేటలో ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ అభివృద్ధి అంటే కేవలం భవనాలు కట్టడం కాదని, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణమే నిజమైన పురోగతి అని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో యోగా ఇతర క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే అత్యాపత్యా జాతీయ క్రీడలకు ఎంపికైన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తోట సతీష్, సిద్దిపేట స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయిరాం, అసోసియేషన్ సభ్యులు, సిద్దిపేట జిల్లా అత్యపత్య అసోసియేషన్ చైర్మన్ జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, ప్రెసిడెంట్ ఇప్ప నరసింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ యోగా పోటీలకు ఎంపికైన వారిని సన్మానిస్తున్న హరీశ్‌రావు

ఈగల వ్యాప్తికి కోళ్లఫారాల యజమానులదే బాధ్యత

● డీపీవో దేవకీదేవి

దౌల్తాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఈగల వ్యాప్తికి కోళ్ల ఫారాల యాజమానులే బాధ్యత వహించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) దేవకీదేవి అన్నారు. దౌల్తాబాద్ మండలం ముబారస్‌పూర్ గ్రామంలో ఈగల బెడద ఎక్కువగా ఉందని శనివారం ఓ గ్రామస్థుడు డీపీవోకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆదివారం గ్రామాన్ని సందర్శించిన డీపీవో, డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో)తో కలిసి పరిస్థితిని సమీక్షించారు. కోళ్ల ఫారాల్లో చనిపోయిన కోళ్లను విచ్చలవిడిగా బయట పడేయడం వల్లే ఈగల వ్యాప్తి అధికమైందని ఆమె గుర్తించారు. వెంటనే గ్రామంలో ఫాగింగ్, ఈగల మందు పిచికారీ చేయించారు.



అక్కన్నపేట మండలం మల్లంపల్లిలో ఆకుముడత, దోమకాటుకు గురైన పత్తి పంట



ఆపత్తి

ఆకుముడత, పచ్చ, తెల్లదోమతో ఎర్రబారుతున్న మొక్కలు

ఇష్టానుసారంగా మందులు అమ్ముతున్న డీలర్లు


పెట్టుబడి పెరిగినా దిగుబడి సగానికి తగ్గే ప్రమాదం

దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు

అక్కన్నపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పత్తి రైతులు తెగుళ్ల బెడదతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పత్తి చేలలో కలుపు మొక్కలు పెరిగి, పంటలకు తెగుళ్లు ఆశించాయి. దీంతో మొక్కలు ఎదగడం ఆగిపోయి ఎర్రబారుతున్నాయి. ఆకుముడత, పచ్చదోమ, తెల్లదోమ వంటి తెగుళ్లతో దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 1.05 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లా వ్యాప్తంగా ఈ వానాకాలం సీజన్‌లో 1.05 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. ప్రస్తుతం పత్తి పంట 45 నుంచి 60 రోజుల దశలో ఉంది. ఈ సమయంలో వర్షాల కారణంగా కలుపు విపరీతంగా పెరిగి, మొక్కల పెరుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సాధారణంగా ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చే పంట, ఇప్పుడు 5 క్వింటాళ్లకు మించి వచ్చే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు.



డీలర్ల ఇష్టారాజ్యం

పంటకు తెగుళ్లు సోకిందని డీలర్ల వద్దకు వెళ్తే, సరైన సలహాలు ఇవ్వకుండా నాలుగైదు రకాల మందులను అంటగడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అమాయక రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని డీలర్లు లక్షలు గడిస్తున్నారని మండిపడుతున్నారు. కేవలం ఒక్క అక్కన్నపేట మండలంలోనే 30కిపైగా పురుగుల మందుల దుకాణాలు ఉన్నాయి. డీలర్ల సలహాలతో ఖరీదైన మందులు పిచికారీ చేసినా ఫలితం కనిపించడం లేదు.

పెట్టుబడి రావడం కష్టమే



రెండు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. ఇప్పటివరకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టాను. పంటకు తెగుళ్లు సోకింది. ఆకుముడత, దోమకాటుకు పురుగుల మందు పిచికారీ చేశాను. చెట్లు ముడత పోక ఎర్రబారుతున్నాయి. మందులు స్ప్రే చేసిన తగ్గలేదు. పెట్టిన పెట్టుబడి కూడా రాదు. సర్కారే ఆదుకోవాలె.

- గూళ్ల కిష్టయ్య, రైతు, మల్లంపల్లి, అక్కన్నపేట మండలం

వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండండి

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి : కలెక్టర్ హైమావతి

నంగునూరు/చిన్నకోడూరు/కోహెడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు. ఆదివారం ఆమె నంగునూరు, చిన్నకోడూరు, కోహెడ మండలాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. నంగునూరు మండలం అక్కెనపల్లి వద్ద పొంగిపొర్లుతున్న పెద్దవాగును కలెక్టర్ పరిశీలించారు. చిన్నకోడూరు మండలం సికింద్లాపూర్, ఇబ్రహీంనగర్, అలాగే కోహెడ మండలం గుండారెడ్డిపల్లి, తంగళ్లపల్లి గ్రామాల్లోని లోలెవెల్ కాజ్‌వేలు, బ్రిడ్జిలను పరిశీలించారు. వర్షాలు పెరిగితే ఈ కాజ్‌వేల మీదుగా నీరు ప్రవహించే అవకాశం ఉన్నందున, ప్రజలను అప్రమత్తం చేసి రాకపోకలను నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల సమయంలో సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఈ పర్యటనలో ఆమె వెంట ఇరిగేషన్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, ఇతర అధికారులు ఉన్నారు.



చిన్నకోడూరు మండలం సికింద్లాపూర్‌లో లోలెవల్ కాజ్‌వే వద్ద నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

అంగన్‌వాడీ టీచర్లకు అవస్థలు

ఫేస్ క్యాప్చర్ హాజరుతో కష్టాలు

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు తప్పనిసరి

నెట్‌వర్క్ సమస్యలతో తప్పని తిప్పలు



ఇంటికి వెళ్లి ఫేస్ క్యాప్చర్ హాజరును నమోదు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫేస్ క్యాప్చర్ (ముఖ గుర్తింపు) విధానం అంగన్‌వాడీ టీచర్లకు కష్టాలు తెచ్చిపెట్టింది. గర్భిణులు, బాలింతలు, ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు ఫేస్ క్యాప్చర్ ద్వారా హాజరు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గతంలో సంతకాల ద్వారా హాజరు తీసుకునేవారు.

1150 అంగన్‌వాడీలు

సిద్దిపేట జిల్లాలో 1150 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 597 మంది గర్భిణులు, 4,971 మంది బాలింతలు, సుమారు 62 వేల మంది పిల్లలు ఉన్నారు. వీరందరికీ ఫేస్ క్యాప్చర్ ద్వారా హాజరు నమోదు చేయాల్సి వస్తోంది.

నెట్ సమస్యలు

ప్రతీ కేంద్రంలో సగటున 25 నుంచి 30 మంది పిల్లలు, 15 మంది బాలింతలు, పది మంది గర్భిణులు ఉంటారు. అయితే, సర్వర్, నెట్‌వర్క్ సమస్యలతో ఒక్కో ఫేస్ క్యాప్చర్‌కు గంటల సమయం పడుతోందని టీచర్లు వాపోతున్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన 3జీ ఫోన్లలో పని చేయడం కష్టంగా ఉందని వారు చెబుతున్నారు. కొన్నిసార్లు నెట్ ఉన్నా సైట్ పనిచేయడం లేదని, దీంతో ఇళ్ల దగ్గరకు వెళ్లినా హాజరు నమోదు చేయలేక పోతున్నామని అంటున్నారు. ఈ విధానంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమకు 5జీ నెట్‌వర్క్ సపోర్ట్ చేసే కొత్త ఫోన్లు ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్లు కోరుతున్నారు. పాత ఫోన్లలో ఇతర యాప్ వర్క్‌లను చేయడం కష్టంగా ఉందని పేర్కొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


కార్తిక్(ఫైల్)

చేగుంట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చేగుంట మండల పరిధిలోని రెడ్డిపల్లి వడ్డెర కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. కాలనీవాసులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన ఉప్పు కార్తిక్ (22) ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డిని సంప్రదించగా దీనికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని వెల్లడించారు. కార్తిక్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

పేకాటరాయుళ్ల అరెస్టు

● నగదు, ద్విచక్రవాహనాలు స్వాధీనం


జహీరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ మండలం హోతి(బి) గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 8 మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి, నిందితుల నుంచి రూ.53,350, 8 మొబైల్ ఫోన్లు, 7 ద్విచక్ర వాహనాలు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. వారిపై సుమోటో కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. మట్కా, పేకాట, ఇతర జూదాలు ఆడుతున్నట్లు సమాచారం తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

19న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

మెదక్ అర్బన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): 11వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ కోసం ఈనెల 19న ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు మెదక్ స్టేడియంలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. అండర్-14, 16, 18, 20 బాలబాలికలకు రన్స్ త్రో జేమ్స్ విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 31న మహబూనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9963005540 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

మేకను కాపాడేందుకు బావిలో దూకిన కాపరి


● తీరా ఈత రాకపోవడంతో కేకలు
● కాపాడిన స్థానికులు


రామచంద్రాన్ని పైకి లాగుతున్న దృశ్యం

చేర్యాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణ శివారులోని కర్షక్‌నగర్ కాలనీలో ఆదివారం బావిలో దూకిన ఓ వ్యక్తిని స్థానికులు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఊట్లపల్లి కాలనీకి చెందిన రామచంద్రం మేకలు కాస్తుండగా, ఓ మేక బావిలో పడిపోయింది. దానిని కాపాడటానికి రామచంద్రం బావిలోకి దూకాడు. తీరా అతడికి ఈత రాకపోవడంతో ప్రాణభయంతో కేకలు వేశాడు. ఆ దారిన వెళ్తున్న కాంగ్రెస్ నాయకుడు నాగరాజు అరుపులు విని అక్కడి వెళ్లి చూడగా రామచంద్రం కనిపించాడు. దీంతో స్థానికుల సహాయంతో బయటకు లాగారు. నాగరాజును స్థానికులు స్థానికులు అభినందించారు.

హిట్ అండ్ రన్ బాధితులకు ఆర్థిక సహాయం

- మృతిచెందినవారికి రూ.2లక్షలు
- గాయపడినవారికి రూ.50 వేలు



తెలుసుకుందాం

సిద్దిపేట క్రైం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్న తరుణంలో, ముఖ్యంగా హిట్ అండ్ రన్ కేసులలో బాధితులను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. మోటార్ వెహికల్స్ యాక్ట్-1988లోని సెక్షన్ 161 కింద రూపొందించబడిన ఈ కొత్త పథకం 2022 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చింది. ఇది అంతకుముందు ఉన్న 1989 సోలాటియం స్కీమ్‌ను రద్దు చేసి, బాధితులకు మరింత ఎక్కువ ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పథకం ప్రకారం, ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.2లక్షల పరిహారం లభిస్తుంది. అదే విధంగా, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 వేలు సహాయం అందజేయబడుతుంది. ఇది పాత పథకంలో ఉన్న మొత్తాల కంటే చాలా ఎక్కువ. ఈ పథకం ద్వారా, వాహనం వివరాలు తెలియని ప్రమాదాల్లో ఆర్థికంగా నష్టపోతున్న బాధితులకు కొంత ఊరట లభిస్తుంది.

దరఖాస్తు విధానం..

బాధితులు లేదా వారి కుటుంబ సభ్యులు ఈ సహాయం కోసం ప్రమాదం జరిగిన 6 నెలల లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తును ఫారం-1 ద్వారా సంబంధిత రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌కు సమర్పించాలి. దరఖాస్తుతో పాటు, పోలీస్ ఎఫ్ఐఆర్, మరణం సంభవిస్తే పోస్టుమార్టం సర్టిఫికేట్, లేదా గాయాలైతే ఇంజురీ సర్టిఫికేట్ వంటి ముఖ్యమైన పత్రాలను జతచేయాలి. దరఖాస్తు అందిన తరువాత, విచారణ జరిపి, ఫారం-2 ద్వారా ఒక నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపుతారు. జిల్లా కలెక్టర్, నివేదికను పరిశీలించి, ఫారం-3 ద్వారా పరిహారాన్ని ఆమోదిస్తారు. ఆ తర్వాత, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ బాధితుల బ్యాంక్ ఖాతాలో డబ్బును నేరుగా జమ చేస్తుంది. ఈ మొత్తం ప్రక్రియ 6 నెలల లోపు పూర్తి కావాలని ప్రభుత్వం నిర్దేశించింది.

పర్యవేక్షణ, పోలీసుల పాత్ర

పథకం అమలును జిల్లా స్థాయిలో ఒక మానిటరింగ్ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఇందులో డ్రిస్టిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సభ్యులుగా ఉంటారు. కేంద్ర స్థాయిలో కూడా ఈ పథకం కోసం ఒక స్టాండింగ్ కమిటీ ఏర్పాటు చేయబడింది. ప్రమాదం జరిగినప్పుడు, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధికారి బాధితులకు ఈ పథకం గురించి సమాచారం అందిస్తారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం, ఈ సహాయం ఎలా పొందాలో వివరిస్తారు. సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ మాట్లాడుతూ, బాధితులు ఈ పథకాన్ని తప్పకుండా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ పథకం గురించి మరిన్ని వివరాల కోసం సమీపంలోని రెవెన్యూ డివిజనల్ ఆఫీస్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లేదా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ వెబ్‌సైట్ ను సంప్రదించవచ్చు.

క్రైం కార్నర్

128 కేజీల ఎండు గంజాయి పట్టివేత

- గంజాయి విలువ రూ.64 లక్షలు
- నలుగురి అరెస్టు, రెండు కార్లు స్వాధీనం

పటాన్‌చెరు ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా రవాణా చేస్తున్న 128 కేజీల ఎండు గంజాయిని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ జయకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రం గజపతి జిల్లా నుంచి ఫిరోజ్ అహ్మద్, సగర్‌నాయక్, మహ్మద్ అబ్దుల్, ఇర్ఫాన్ మహ్మద్ మహారాష్ట్ర మాలేగామ్‌కు రెండు కార్లలో 128 కేజీల ఎండు గంజాయిని రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా నార్కోటిక్ ఎనాలసిస్ (ఎస్ఎన్‌బీ) విభాగం నిఘా పెట్టి తెల్లాపూర్ పురపాలక పరిధి పాటి కూడలిలో వారిని పట్టుకున్నారు. నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రెండు కార్లు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. 64 లక్షల వరకు ఉంటుందని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణం తీసిన బైక్ రైడింగ్ మోజు

నర్సాపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బైక్ రైడింగ్ మోజు ఒక యువకుడి ప్రాణాలను బలిగొన్న ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి సమీపంలో జరిగింది. ఆదివారం నర్సాపూర్ ఎస్ఐ లింగం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని బండ్లగూడకు చెందిన ఎస్‌బీఐ ఉద్యోగి అనిల్‌కుమార్ కుమారుడు శశాంక్‌నాథ్(27) ఆదివారం ఉదయం రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై, అతడి స్నేహితుడు ఆదిత్య మరో బైక్‌పై మెదక్ సమీపంలోని పోచారం డ్యాం వరకు రైడింగ్‌కు వచ్చారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి సమీపంలో శశాంక్‌నాథ్ బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీ కొని తీవ్ర గాయాలతో పడి ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు శశాంక్‌నాథ్‌ను నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఇది తెలియని ఆదిత్య వెనుకాల వస్తున్నాడని అనుకుని ఇంటికి చేరుకున్నాడు. శశాంక్ ఎంతకి ఇంటికి రాకపోవడంతో నర్సాపూర్ పోలీసులను సంప్రదించగా రోడ్డు ప్రమాదానికి గురైనట్టు తెలిసింది. శశాంక్‌నాథ్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

కారు ఢీకొని ద్విచక్రవాహనదారుడు..



విఠల్ మృతదేహం



ప్రమాదానికి కారణమైన కారు



నుజ్జునుజ్జైన ద్విచక్రవాహనం

దుబ్బాక, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి) :కారు ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన మంతూరి విఠల్(60), అతడి కుమారుడు చంద్రశేఖర్(35) ఆదివారం రాత్రి సిద్దిపేట వైపు టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై వెళ్తున్నారు. దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామశివారులోకి రాగానే సిద్దిపేట నుంచి రామాయంపేట వైపు వెళ్తున్న కారు వీరిని ఢీకొట్టడంతో తండ్రికొడుకులిద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా తండ్రి విఠల్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనకు సంబంధించిన పూర్తిగా వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

- నలుగురికి గాయాలు



నుజ్జునుజ్జైన కారు

అల్లాదుర్గం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అల్లాదుర్గం మండలం చిల్వర్ సమీపంలోని 162వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన స్వరాజ్యలక్ష్మి, గంగాధర్ల కుమార్తె శ్రీహర్షను సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూలో చేర్పించడానికి తండ్రి శంకర్‌తో కలిసి కారులో వెళ్తున్నారు. ఐబీ సమీపంలో రోడ్డుపై ఒక చెడిపోయిన లారీని టైర్ తొలగించి పక్కన ఉంచారు. వీరి కారు ముందుగా ఆ టైర్‌ను ఢీకొని అదుపుతప్పి లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్వరాజ్యలక్ష్మి, గంగాధర్‌లకు స్వల్ప గాయాలు కాగా, శ్రీహర్ష, శంకర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

మహిళ హత్య కేసులో నిందితుడి రిమాండ్



కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కంగ్టి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాంతీర్థ్ శివారులో ఈ నెల 14న జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కంగ్టి సీఐ వెంకటరెడ్డి, ఎస్ఐ దుర్గారెడ్డి తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. తుర్కవడగాం గ్రామానికి చెందిన నర్సమ్మ(35) భర్త 15 ఏళ్ల క్రితం మరణించాడు. ఒంటరిగా ఉంటున్న నర్సమ్మతో రాంతీర్థ్ గ్రామానికి చెందిన మేత్రిరాజు(40)తో ఏడాదిగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో తనను పెళ్లి చేసుకోవాలని నర్సమ్మ రాజును తరచుగా కోరడంతో నిరాకరించాడు. ఈ నెల 14న రాంతీర్థ్ శివారులో ఉన్న రేకుల షెడ్డులో ఇద్దరూ మాట్లాడుకుంటుండగా పెళ్లి విషయమై గొడవ జరిగింది. దీంతో రాజు నర్సమ్మ ఎలాగైన వదిలించుకోవాలన్న ఉద్దేశంతో ఆమె తలపై, ఛాతీపై రాయితో బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

డ్రాగన్‌ఫ్రూట్.. పోషకాలు పుష్కలం

- రూ. 100కు కిలో చొప్పున విక్రయం



మెదక్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి మేలు చేసే పోషకాలతో నిండిన డ్రాగన్‌ఫ్రూట్‌ను వ్యాపారులు మొబైల్ వ్యాన్‌లలో తిరుగుతూ జిల్లా అంతటా విక్రయిస్తున్నారు. జహీరాబాద్‌లోని తోటల్లో స్థానిక రైతులు పండించిన ఈ పండును కిలో రూ.100కే అమ్ముతున్నారు. ఒక్క పండు 80 ధర పలికిన రోజులు ఉన్నాయని, ఇప్పుడు అదే ధరకు ఐదారు పండ్లు లభిస్తుండటంతో ప్రజలు ఎగబడి కొంటున్నారు. తమ లాభాలు తగ్గించుకుని ఎక్కువ అమ్మకాలు చేస్తున్నామని జహీరాబాద్‌కు చెందిన వ్యాపారి ఉస్మాన్ ఖాన్ తెలిపారు. డ్రాగన్‌ఫ్రూట్‌లో విటమిన్ సి, ఫైబర్, ఐరన్, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు జీర్ణ వ్యవస్థకు, చర్మకాంతికి, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని పేర్కొన్నారు.

మనువాదం, మతోన్మాదంపై పోరు

- జైభారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణమూర్తి



జోగిపేట సభలో ప్రసంగిస్తున్న రమణ మూర్తి

జోగిపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు దేశంలో మతోన్మాదం, మనువాదం పెరిగిపోతుందని జైభారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణమూర్తి వాపోయారు. ఆదివారం జోగిపేటలోని జోగినాథ గంజ్ ఆవరణలో నిర్వహించిన "జైభారత్ సామాజిక విప్లవ రణభేరి" సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మతం పేరిట దేశం చీలకుండా చివరి వరకు పోరాటం చేసిన ఏకైక వ్యక్తి గాంధీజీ అన్నారు. అదే సమయంలో ఆయన కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ఇక కుల వివక్షను ఎదుర్కొని, దానిపై పోరాడిన వ్యక్తి అంబేద్కర్ అని గుర్తుచేశారు.. అయితే అంబేద్కరిస్టులుగా చెప్పుకునే పలువురు మేధావులు గాంధీని కులవాదిగా ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. గాంధీ, అంబేడ్కర్‌పై సమాజంలో నెలకొన్న అబద్ధాల చీకటిని బద్దలు కొట్టి వాస్తవాలను ప్రజలకు చూపడానికి జైభారత్ ఉద్యమం చేస్తోందన్నారు. సాహసం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముప్పారం ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జైభారత్ జాతీయ కార్యదర్శి రజని, రణభేరి రాష్ట్ర రీఆర్గనైజింగ్ కమిటీ కోకన్వీనర్ జీవన్ జోయెల్, జిల్లా నాయకులు అందోల్ మల్లేశం, పోలె నరేందర్, ముప్పారం పద్మారావు, తంపులూరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..



గుంతలమయంగా మిర్జాపల్లి, శేరిపల్లి రోడ్డు

చిన్నశంకరంపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లి, నార్సింగి మండలం శేరిపల్లి మధ్య ఉన్న మట్టి రోడ్డు అధ్వానంగా తయారైంది. ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో చినుకుపడితే చిత్తడిగా మారిపోతోంది. దారి పొడవునా గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారింది. రోడ్డు మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసినా మరమ్మతులు నోచుకోవడం లేదు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రయాణీకులకు ఇబ్బందులు తీర్చాలని మిర్జాపల్లి, శేరిపల్లి గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కథల పోటీలో అనంతసాగర్ విద్యార్థికి బహుమతి



విశ్వతేజ

చిన్నకోడూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని ఉరిమళ్ల ఫౌండేషన్ నిర్వహించిన బాలల కథల పోటీలో చిన్నకోడూరు మండలం అనంతసాగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఏడవ తరగతి విద్యార్థి బి. విశ్వతేజ బహుమతి గెలుచుకున్నాడు. విశ్వతేజ రాసిన 'బెట్టింగ్ గేమ్' కథ బహుమతికి ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి ఆదివారం తెలిపారు. ఈనెల 24న ఖమ్మంలో జరగనున్న కార్యక్రమంలో విశ్వతేజకు నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో పాటు అతని కథ ముద్రించిన కథా సంకలన పుస్తకాన్ని అందజేస్తారని ఆమె చెప్పారు. విద్యార్థిని ప్రోత్సహించిన ఉపాధ్యాయుడు భైతి దుర్గయ్యను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ముళ్లపొదల్లో అతిథి గృహం



చిన్న ఘనపూర్ శివారులో ఉన్న అతిథి గృహం

కొల్చారం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : కొల్చారంలో రూ.లక్షలు వెచ్చించి అతిథి గృహ నిర్మాణం చేపడితే.. అతిథులు రాకపోవడంతో ముళ్లపొదలు పెరిగి, మందుబాబులకు అడ్డాగా మారింది. కొల్చారం మండలం చిన్నఘనపూర్ శివారులో రూ.10 లక్షలతో అతిథి భవన నిర్మాణం ఏర్పాటు చేశారు. అయితే అక్కడికి ఏ ఒక్క ప్రజాప్రతినిధి రాకపోవడంతో అందులో నీటి పారుదల శాఖ అధికారులు పెద్దఎత్తున సామగ్రి వేశారు. దీంతో భవనంలోని విలువైన ఫర్నిచర్ తుప్పుపట్టి పనికిరాకుండా పోయింది. బయట వేసిన బండలను, కిటికీలను ధ్వంసం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముళ్ల పొదల్లో ఉన్న అతిథి గృహానికి మరమ్మతులు చేయాలని స్థానికులు తెలుపుతున్నారు.

ఉపాధ్యాయుడు రామకృష్ణకు పద్మచక్ర జాతీయ పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయుడు రామకృష్ణ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నిజాంపూర్(కె) ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ పోట్రు రామకృష్ణకు పద్మచక్ర జాతీయ పురస్కారం లభించింది. తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బాబుమోహన్, ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీత, న్యూమరాలజిస్ట్ దైవజ్ఞశర్మల చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. విద్యా, పర్యావరణ రక్షణ రంగంలో చేసిన సేవలకుగాను ఈ పురస్కారం లభించిందని రామకృష్ణ తెలిపారు.

సింగూరు గురుకుల విద్యార్థులకు అస్వస్థత

- వైద్య శిబిరం ఏర్పాటు



గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ సాయికిరణ్

పుల్కల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పుల్కల్ మండలంలోని సింగూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. గత మూడు రోజులుగా విద్యార్థులు అస్వస్థతతో ఉండటంతో పుల్కల్ పీహెచ్‌సీ డాక్టర్ సాయికిరణ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మొత్తం 22 మంది విద్యార్థులు అస్వస్థతకు గురవగా, చికిత్స అనంతరం సగం మంది కోలుకున్నారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇళ్లకు తీసుకువెళ్లేందుకు పాఠశాలకు బారులు తీరారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ ఆగమయ్య సంప్రదించగా ఆగస్టు 15న నిర్వహించిన ఆటల పోటీల్లో వర్షంలో తడవడం వల్ల వారికి వైరల్ ఫీవర్ వచ్చిందని తెలిపారు. విద్యార్థులు కోలుకునే వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు.

అధిక ధరలకు కొబ్బరికాయలు

- మలన్న సన్నిధిలో రూ.60 వరకు వసూలు
- వారానికో ధర, ఇష్టారీతిన విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న ఆలయాధికారులు,అర్చకులు

కొమురవెల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయ ఆవరణలో అమ్ముతున్న కొబ్బరికాయల ధరలు చూసి ఆశ్చర్యపోతున్నారు. దేవాలయ నిబంధనల ప్రకారం ఒక్కో కొబ్బరికాయను రూ.30కి విక్రయించాలి. కానీ విక్రయదారులు నిబంధనలను పట్టించుకోకుండా ఒక్కో కాయను 50 నుంచి 60 వరకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై భక్తుల నుంచి ఫిర్యాదులు అందాయని, టెండర్ దారునికి నోటీసు జారీ చేసి మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించామని ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు. లేని పక్షంలో నిబంధనల ప్రకారం టెండర్‌ను రద్దు చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆమె అన్నారు.

మల్లన్న ఆలయంలో భక్తజన సందడి

కొమురవెల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. గంగిరేణి చెట్టు వద్ద, ఆలయ ముఖ మండపంలో పట్నాలు వేసి, బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏఈవో శ్రీనివాస్,ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం నుంచి మల్లన్నను దర్శించుకున్న భక్తులకు ఉచితంగా ప్రసాదం పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆలయ అధికారులు ప్రారంభించారు.

నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రానికి భక్తుల తాకిడి



వర్గల్, ఆగస్టు 17 (ఆంధ్ర జ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో శ్రావణ మాసం చివరి ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో 35 సత్యనారాయణ స్వామి వ్రతాలు, 10 నిజాభిషేకాలు, 9 నిత్యకల్యాణాలు జరిగినట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు పర్యవేక్షణలో సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.

పార్కు చేసిన స్కూటీ చోరీ

నర్సాపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ బస్టాండ్ సమీపంలోని టిఫిన్ సెంటర్ వద్ద పార్క్ చేసిన స్కూటీ చోరీకి గురైంది. నర్సాపూర్‌కు చెందిన శక్తి ఆకాష్ అనే వ్యక్తి తన స్కూటీని పార్క్ చేసి పండ్ల దుకాణానికి వెళ్లి వచ్చేసరికి అది కనిపించలేదు. చుట్టూ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లింగం తెలిపారు.

న్యూస్ బాక్స్

శతాధిక వృద్ధురాలు మృతి

మద్దూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు శనివారం రాత్రి మృతి చెందింది. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, గొర్రెల మేకల పెంపకం దారుల రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఆలేటి యాదగిరి నానమ్మ ఆలేటి భూదెమ్మ(105) రాత్రి మృతి చెందింది. ఆదివారం స్వగ్రామమైన వల్లంపట్లలో అంత్యక్రియలు నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, నాయకులు మృతురాలి కుటుంబీకులను పరామర్శించారు.

టీఎంపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజు

జగదేవ్‌పూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రాగుల రాజు తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తనకు పదవి బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర కమిటీకి, నియోజకవర్గం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మృతుడి కుటుంబానికి అండగా స్నేహితులు

దౌల్తాబాద్,ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మృతుడి కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామానికి చెందిన రామన్న గారి ప్రభాకర్ అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. అతడితో కలిసి చదువుకున్న స్నేహితులు ఆదివారం ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించి రూ.11 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పోసాని రాజు, భాను, కళ్యాణ్, అనిల్, సాయి, వంశీ, రాజు, శ్రీశైలం, ప్రభుదాస్, మాజీ ఉప సర్పంచ్ కేశబోయిన ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సొంతడబ్బుతో గుంతల పూడ్చివేత

గజ్వేల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-తొగుట రోడ్డులో భారీ గుంతలు ఏర్పడి నిత్యం ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. దీంతో చలించిపోయిన గ్రామ మాజీ ఎంపీటీసీ గొడుగు జ్యోతి స్వామి తన స్నేహితులతో కలసి ఎక్స్‌కవేటర్‌తో కంకర, సిమెంట్, ఇసుక వేసి గుంతలను పూడ్చి వేయించారు. దీంతో గ్రామస్థులు స్వామిని అభినందించారు.

గ్రామ పంచాయతీ సిబ్బందికి ఉద్యోగభద్రత కల్పించాలి

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక కర్షక భవన్‌లో జరిగిన తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ 3వ మహా సభకు ఆయన హాజరై మాట్లాడారు. గ్రామ అభివృద్ధి ప్రజల ఆరోగ్య విషయాల్లో ముఖ్య పాత్ర పోషిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కరువైందని అన్నారు. కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్ ,యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేష్ , వివిధ మండలాల నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

మతోన్మాద రూపంలో ప్రజాస్వామ్యానికి ముప్పు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దేశంలో మతోన్మాద రూపంలో ప్రజాస్వామ్యానికి, లౌకిక తత్వానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ అన్నారు. ఆదివారం సీపీఎం కార్మిక కర్షక భవనంలో నయా పాసిజానికి దారులు వేస్తున్న నయా ఉదారవాదం - నయా పాసిజం అనే అంశంపై సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్ అధ్యక్షతన స్టడీ సర్కిల్ జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన అబ్బాస్ మాట్లాడుతూ బీజేపీ నయా ఉదారవాద విధానాలతో దేశంలో ఆర్థిక, సామాజిక అంతరాలకు దారితీస్తుందన్నారు. మతోన్మాద రూపంలో ముంచుకొస్తున్న నయా పాసిజాన్ని ఎదుర్కోవడానికి ప్రజలను సన్నద్ధం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ స్టడీ సర్కిల్లో రాష్ట్ర నాయకులు మూడ్ శోభన్ నాయక్, సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ బహిరంగ సభను జయప్రదం చేయండి

సిద్దిపేట క్రైం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసులపై చేస్తున్న హత్యాకాండను తక్షణమే ఆపివేయాలని కోరుతూ ఆగస్టు 24న వరంగల్ నిర్వహించబోయే బహిరంగ సభను జయప్రదం చేయాలని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాగుల భూపతి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో భూపతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం వివిధ ప్రజా సంఘాల నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు, తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ జి.సత్తయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శ్రీకాంత్, న్యాయవాది ఏ.బాబురావు, దళిత నాయకులు భీమసేన మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం అడవుల్లో నివసిస్తున్న ఆదివాసి, గిరిజన ప్రజలపై హత్యాకాండను కొనసాగుతున్నారని మండిపడ్డారు.

బ్రహ్మోత్సవాలకైనా అందుబాటులోకి వచ్చేనా?

- కొమురవెల్లి మల్లన్న సన్నిధిలో ఏళ్లుగా కొనసాగుతున్న 50 గదుల సత్రం నిర్మాణ పనులు
- అదనపు నిధులు వెచ్చిస్తే అందుబాటులోకి వచ్చే అవకాశం
- ఆలయ గదులు సరిపోక భక్తుల ఇబ్బందులు


కొమురవెల్లిలో బండగుట్టపై కొనసాగుతున్న సత్రం నిర్మాణ పనులు

కొమురవెల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి సన్నిధిలో భక్తులు ప్రశాంత వాతావరణంలో బస చేసేందుకు తలపెట్టిన 50 గదుల సత్రం నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. 2018లో గత ప్రభుత్వ హయాంలో కొమురవెల్లి ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో గల బండగుట్టపై సుమారు రూ.11 కోట్ల పంచాయతీరాజ్ నిధులు, దేవస్థానం నిధులతో చేపట్టిన 50 గదుల సత్రం నిర్మాణం పనులు ఏళ్లుగా ఆగుతూ.. సాగుతున్నాయి. ప్రతి ఏటా ఈ సారి బ్రహ్మోత్సవాలకు అందుబాటులోకి వస్తుందనుకున్న భక్తులకు నిరాశే మిగులుతుంది.

ఎనిమిదేళ్లుగా సాగుతున్న పనులు:

50 గదుల సత్రం నిర్మాణ పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో సుమారు 8 ఏళ్లుగా కొనసాగుతున్నాయి. ఆలయాధికారులు ఎప్పటికప్పుడూ పర్యవేక్షణ చేస్తున్నా ఇప్పటివరకు కేవలం 70 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 30 శాతం పనులు పూర్తి కావడానికి ఇంకెన్నేళ్ల పడుతుందో అంటూ భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆలయం వద్ద దాతలు నిర్మించిన సుమారు 100 గదులు ఉన్నప్పటికీ, భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తుండటంతో అవి సరిపోవడం లేదు. ఫలితంగా బస చేయడానికి వచ్చిన భక్తులు అరకొర వసతుల మధ్య ఇబ్బందులు పడుతున్నారు.

అదనపు నిధుల వెచ్చిస్తేనే...

సత్రం భవన నిర్మాణం పూర్తయినా, అందులో విద్యుత్, ప్లంబింగ్, ఫుట్‌రోడ్ ఫెన్సింగ్, ఫర్నిచర్ తదితర సౌకర్యాల కోసం ఇంకా సుమారు రూ. కోటి అవసరమవుతాయని కాంట్రాక్టర్ అధికారులకు తెలిపాడు. ఈ అదనపు నిధులు పంచాయతీరాజ్ విభాగం నుంచి వెచ్చిస్తారా లేక దేవస్థానం నిధుల నుండి వెచ్చిస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ నిధులు మంజూరు చేస్తేనే సత్రం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

త్వరలో పూర్తి చేసేందుకు యత్నిస్తాం



గత నెల జూలై చివరి వరకు బండగుట్టపై 50 గదుల సత్రం నిర్మాణం పూర్తిచేసి దేవస్థానానికి అప్పగిస్తామనీ కాంట్రాక్టర్ తెలిపాడు.ఇప్పటిరవకు దేవస్థానం నిధుల నుండి రూ.3.70 కోట్లు చెల్లించాము.మిగిలినా 30 లక్షల రూపాయలు పనులు పూర్తైన వెంటనే చెల్లిస్తాము.పనుల్లో ఏలాంటి పురోగతి లేదు.తొందరలోనే కాంట్రాక్టర్‌కు దేవస్థానం నుండి నోటీసులు జారీచేసి నిర్మాణ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించి వీలైనంత తక్కువ సమయంలో భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తాము.

- అన్నపూర్ణ, ఆలయ కార్యనిర్వహణాధికారి

ఆధ్యాత్మిక సేవతో సంతృప్తి: హరీశ్‌రావు


సిద్దిపేట సుందర సత్సంగంలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్/సిద్దిపేట రూరల్/చిన్నకోడూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక సేవలోని సంతృప్తి అనిర్వచనీయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని సుందర సత్సంగంలో ఆదివారం జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు శివారులోని శ్రీకృష్ణుడి ఆలయంలో హరీశ్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు హరీశ్‌రావుకు ఘన స్వాగతం పలికారు. చిన్నకోడూరు మండలం చెర్లఅంకిరెడ్డిపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆదివారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు హరీశ్‌రావును ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్‌లు సదానందం, కనకరాజు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, నాయకులు పాల్గొన్నారు.


ఏటిగడ్డ కిష్టాపూర్‌లో ఆలయాలకు భూమిపూజ చేస్తున్న గ్రామస్థులు

ఏటిగడ్డ కిష్టాపూర్‌లో ఆలయాల పనులకు భూమిపూజ

గజ్వేల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీలోని ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామంలో ఆయా ఆలయాల నిర్మాణానికి గ్రామస్థులంతా ఏకమై భూమిపూజ చేశారు. తమ ముంపు గ్రామంలోని ముత్యాలమ్మ, పోచమ్మ ఆలయాల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ నర్సింహ్మారెడ్డి, మాజీ సర్పంచ్ దామరంచ ప్రతాప్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

శ్రీబాట లక్ష్మీనృసింహుడి కల్యాణానికి ఏర్పాట్లు


ఆలయంలో కొలువుదీరిన స్వామివారు

మర్కుక్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణేష్‌పల్లిలో శ్రీ బాటలక్ష్మీ నృసింహ స్వామి కల్యాణోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా శ్రావణమాసంలో మొదటి శనివారం పూజలను ప్రారంభించి నెలలో వచ్చే నాలుగు శని, సోమ వారాల్లో స్వామివారికి బియ్యం ఇచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. గణేష్‌పల్లి, తిగుల్, చేబర్తి గ్రామాల ప్రజలు వనభోజనాలను కూడా ఇక్కడే చేసుకోవడం ఆనవాయితీ. చివరి వారంలో స్వామివారికి ఐదు రోజుల పాటు వేడుకలు నిర్వహించి ముగిస్తారు. స్వామివారికి సుప్రభాత సేవ, ఆద్య పూర్ణాహుతి, విష్ణు సహస్రనామ పారాయణం, నవగ్రహ ప్రతిష్ఠ, ఆలయంలో స్వామి వారి తిరు కల్యాణోత్సవం, పల్లకి సేవ నిర్వహించనున్నారు.

'పల్లా' సూచనతో కడవేరుగు దారి మరమ్మతులు


కడవేరుగు దారిలో మట్టితో చదును చేయిస్తున్న మాజీ ఎంపీటీసీ గదరాజు

చేర్యాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): చేర్యాల - నాగపురి ప్రధానరహదారిపై మండలంలోని కడవేరుగు గ్రామశివారులో చేపట్టిన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పనులు కొన్నాళ్ల క్రితం నిలిచిపోగా, డైవర్షన్ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిని గుంతలమయమైంది. దీంతో పొరుగు గ్రామాల ప్రజలతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో స్థానికులు ఈ సమస్యను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. గ్రామ మాజీ ఎంపీటీసీ గదరాజు యాదగిరితో మాట్లాడి మట్టి, మొరంతో డైవర్షన్ వద్ద ప్రత్యామ్నాయ పనులు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో ఆదివారం గదరాజు యాదగిరితో పాటు పార్టీ కార్యకర్తలు ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లతో మట్టి, మొరంతో దారిని చదును చేశారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి పనులు చేపట్టినందుకు ఆయా గ్రామాల ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

జానపద కళలను కాపాడుకోవాలి


కోలాట ప్రదర్శన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి

హుస్నాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పౌరాణిక, జానపద కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి పేర్కొన్నారు. ఆదివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గస్థాయి పౌరాణిక, జానపద కళాకారుల సాంస్కృతిక జాతర కార్యక్రమంలో మాట్లాడారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మానసిక ఉల్లాసాన్ని కలిగించే మన పౌరాణిక, కోలాట ప్రదర్శనలను భావితరాలకు అందించేందుకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి జంగపల్లి వెంకటనర్సయ్య, సంకల్ప స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు వలస సుభాష్, గంపల శ్రీనివాస్, భైరి చంద్రశేఖర్, రాజ్‌కుమార్, తాళ్లపల్లి సంధ్య తదితరులున్నారు. అనంతరం కళాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

సెప్టెంబరు 17న మూకుమ్మడి నిరాహారదీక్షలు


జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రామగల్ల పరమేశ్వర్

చేర్యాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 17న చేర్యాల డివిజన్ పరిధిలోని గ్రామాల్లో జేఏసీ ఆధ్వర్యంలో మూకుమ్మడి నిరాహారదీక్షలు చేపట్టనున్నామని జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్ పేర్కొన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేయాలని శాంతియుతంగా పోరాడుతున్నా పాలకులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించడం సబబుకాదన్నారు. సెప్టెంబరు 17న ఆయా గ్రామాల్లో రిలేదీక్షల విజయవంతానికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అందె అశోక్, అందె బీరయ్య, బుట్టి సత్యనారాయణ, గడిపె బాలనర్సయ్య, పోలోజు వెంకటాద్రి, కుడిక్యాల బాలమోహన్, నంగి కనకయ్య, బూరుగు సత్తయ్య, మల్లం అంజయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా శ్రావణ బోనాలు


జగదేవ్‌పూర్: తిగుల్‌లో రెడ్డిసంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు


నల్లపోచమ్మకు బోనం తీసుకువెళ్తున్న మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వరూపారాణి

జగదేవ్‌పూర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిగుల్ గ్రామంలో ఆదివారం రెడ్డిసంఘం ఆధ్వర్యంలో శ్రావణమాసం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయమే ఇళ్లను శుభ్రం చేసుకొని కొత్త కుండలను తీసుకువచ్చారు. మధ్యాహ్నం కొత్త కుండలకు పసుపు, కుంకుమ బొట్లు, వేప కొమ్మలతో బోనాలను తయారుచేశారు. అనంతరం డప్పు చప్పుళ్లు, పోతరాజుల ఆటపాటలు, శివసత్తుల శిగాల మధ్యన మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి నివేదించారు.

- **మద్దూరు:** మద్దూరు, దూళిమిట్ట మండలాల్లో గ్రామాల్లో ఆదివారం శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని పోచమ్మ తల్లికి భక్తి శ్రద్ధలతో మహిళలు బోనాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో బయలు దేరి అమ్మవారి ఆలయం చుట్టూరా ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించారు.
- **చేర్యాల:** చేర్యాల పట్టణంలో ఆదివారం గ్రామదేవతల బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నల్లపోచమ్మ, గడిమైసమ్మ, మహంకాళి, బీరప్ప తదితర గ్రామదేవతలకు భక్తిశ్రద్ధలతో బోనాలు నివేదించారు. డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా ఆయా ఆలయాలకు వెళ్లి దేవతామూర్తులకు బోనాలు, నైవేద్యాలను సమర్పించారు.


మద్దూరులో పోచమ్మతల్లికి బోనాలతో ఊరేగింపు

క్రీడలతో మానసికోల్లాసం


వాలీబాల్ క్రీడాకారులతో రూరల్ సీఐ, ఎస్ఐ

సిద్దిపేట రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామంలో రూరల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలకు నిర్మూలనపై గ్రామీణ యువతకు అవగాహన కల్పించడంలో భాగంగా క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చాలా మంది యువకులు సరైన ప్రోత్సాహం లేక చెడు అలవాట్లకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటివి వాడినట్లైయితే వారిని గుర్తించి మంచి కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. పోలీసులు ప్రజలకు మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడేందుకే పోలీసుశాఖ తరఫున క్రీడలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ రాజేష్, సిబ్బంది సుభాష్ రెడ్డి, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు


రోడ్డు నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

కొండపాక, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని త్రీ టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని దుద్దెడలో ఆదివారం గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా, డ్రంకెన్ డ్రైవ్‌లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సైబర్ నేరాలు, రోడ్డు నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

గుంతల రోడ్లను బాగు చేయాలి


నాట్లు వేసి నిరసన తెలుపుతున్న మహిళలు

హుస్నాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని రెడ్డి కాలనీలో గుంతలు పడిన రోడ్లను బాగు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కాలనీ మహిళలు నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి 7 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పనులు ప్రారంభించలేదని విమర్శించారు. వర్షాలు వచ్చినప్పుడు గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా పనులు ప్రారంభించి ఈ కాలనీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి, సంజీవరెడ్డితో పాటు మహిళలు పాల్గొన్నారు.


జిల్లెలగడ్డ తండాలో తీజ్ వేడుకలు

తండాల్లో తీజ్ తళుక్కులు

(5వ పేజీ తరువాయి)

బుట్టల్లో మట్టి, ఆవుపేడ ఎరువు కలిపి గోధుమలు నాటుతారు. వాటిని మంచె మీద పెట్టి నాలుగు రోజుల పాటు రోజుకు మూడు సార్లు బిందెలతో నీళ్లు పోసి జాగ్రత్తగా కాపాడుకుంటారు. ఈ తొమ్మిది రోజులు యువతులు ఉప్పు, కారం లేని ఆహారాన్ని తింటూ కఠినమైన నియమాలు పాటిస్తారు. సాయంత్రం తీజ్ బుట్టల దగ్గర చేరి పాటలు పాడుతూ నృత్యాలు చేస్తారు. ఈ తీజ్ పండుగ వెనుక ఒక ప్రేమ కథ ఉంది. పూర్వం మహారాష్ట్రలోని పోరియాగడ్‌లో దండి మేరామా అనే యువతి ఉండేది. పశువులను కాసే సేవాలాల్‌ను చూసి ఆమె ప్రేమలో పడుతుంది. తన ప్రేమను వ్యక్తపరచడానికి గోధుమ మొలకలతో కూడిన తీజ్‌ను పోసి పక్కనున్న ఆడపిల్లలతో కలిసి ఆటపాటలతో ప్రేమను తెలియజేస్తుంది. కానీ సేవాలాల్ ఆమె ప్రేమను తిరస్కరించి వెళ్లిపోతాడు. వారి పవిత్ర ప్రేమకు ప్రతీకగా గిరిజనులు సేవాలాల్, దండి మేరామాను దేవుళ్లగా కొలుస్తారు.

ఉత్సవాల ముగింపు

తీజ్ ఉత్సవాల్లో చివరి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సేవాలాల్‌కు కొబ్బరికాయలు కొట్టి నైవేద్యం సమర్పిస్తారు. అనంతరం తమ తీజ్ బుట్టలను పెద్దల ఆశీర్వాదం తీసుకుని చెరువులో నిమజ్జనం చేస్తారు. ఈ నిమజ్జనం కూడా పాటలు, ఆటపాటల మధ్య కోలాహలంగా సాగుతుంది. ఈ ఉత్సవాలు ఆగస్టు చివరి వారం వరకు కొనసాగుతాయి. అత్యధికంగా లంబాడీలు ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గంలో ఇప్పటికే సందడి మొదలైంది. ఈ నెల 21న హుస్నాబాద్ పట్టణంలో ఘనంగా వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రేషన్ డీలర్ల డీలా

(5వ పేజీ తరువాయి)

చేసిన కొత్త కార్డులతో కలిపి మొత్తం 2,98,985 వరకు ఉన్నాయి. వీటి ద్వారా నెలకు 6095.48 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. అయితే, జిల్లాలో సెప్టెంబరు నుంచి రేషన్ కార్డుల అర్హుల సంఖ్య మళ్లీ పెరగనున్నది. ఇటీవల కొత్తగా 19,645 మందిని అర్హులుగా గుర్తించి కార్డులను అందజేసింది. దీంతో మొత్తం 3,26,630 రేషన్ కార్డులకు వచ్చే నెల నుంచి బియ్యం పంపిణీ చేయనున్నారు. డీలర్లు పంపిణీ చేసే నెల కోటా కూడా పెరుగనున్నది.

కేంద్రంపై డీలర్ల ఆగ్రహం

కిలోకు రూ. 1.40 చొప్పున డీలర్లకు కమీషన్ చెల్లిస్తున్నారు. ఇందులో కేంద్రం వాటా 45 పైసలు, రాష్ట్రం వాటా 95 పైసలు. మార్చి నెల వరకు కమీషన్లు అందినప్పటికీ, ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు కమీషన్లు నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్, మే నెలల కమీషన్‌ను జూలై 7న విడుదల చేసింది. కానీ జూన్, జూలై, ఆగస్టు నెలల కమీషన్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన ఐదు నెలల కమీషన్లు ఇప్పటివరకు విడుదల కాలేదు. దీనిపై డీలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అద్దెలు, జీతాల భారం

రేషన్‌షాపు డీలర్లు పూర్తిగా ఈ కమీషన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నారు. వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు లేవు. వచ్చిన కమీషన్‌తోనే షాపుల అద్దెలు, హెల్పర్ జీతాలు, కూలీల ఖర్చులు భరించాలి. పట్టణాల్లో రూ.5000, గ్రామాల్లో రూ.2500 అద్దెలు, హెల్పర్‌కు రూ.3000 నుంచి 5000 వరకు జీతాలు, ఒక్కో బస్తాకు రూ.20 హమాలీ కూలీ చెల్లించాల్సి వస్తోంది. బకాయిలు విడుదల కాకపోవడంతో డీలర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు.